

'డబుల్' కాలనీలో సౌకర్యాలేవి?

ఖానాపూర్‌లో 400 డబుల్‌బెడ్రూంలు నిర్మించిన గత ప్రభుత్వం సౌకర్యాలు మరిచింది. ఇందులో ఉంటున్న లబ్ధిదారులకు వేసవి ప్రారంభంలోనే తాగునీటి కటకట మొదలైంది. 9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:27	శుక్ర: 5:03

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం నిర్మలంగా కనిపిస్తుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

పోలీస్‌శాఖలో ప్రక్షాళన



- జిల్లాపై కొత్తబాస్ తనదైన ముద్ర
- ఆరా తీస్తూ.. ట్రాన్స్‌ఫర్ చేస్తూ..
- ఏళ్లుగా ఉన్నవారికి తప్పని బదిలీ

నిర్మల్: జిల్లా పోలీస్‌శాఖలో కొత్తబాస్ తనదైన ముద్రవేస్తున్నారు. అన్ని విభాగాల్లో ప్రక్షాళన చేస్తున్నారు. ఏళ్లుగా పాతుకుపోయిన వారిని కదిలిస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఉన్నవారిని దూరం పెడుతున్నారు. పైరవీలతో పనులు చేస్తూ.. విధులను విస్మరించిన వారిని వదలడం లేదు. ఎవరైనా సరే.. స్టేషన్ బాట పట్టాల్సిందేనంటున్నారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జానకీషర్మిల తీసుకుంటున్న నిర్ణయాలు చాలామంది ఖాకీలను హడలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం డిపార్ట్‌మెంట్‌లో మేడమ్ చేస్తున్న ప్రక్షాళనపైనే చర్చ నడుస్తోంది. కొంతమంది పెదవి విరుస్తుంటే.. చాలామంది హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పోలీస్‌లోనూ పొలిటికల్ ఎఫెక్ట్..

రాజకీయకేంద్రంగా పేరున్న జిల్లాలో ఏ శాఖలో చూసినా పొలిటికల్ ఎఫెక్ట్ కనిపిస్తుంది. ఇందులో పోలీస్‌శాఖకూ మినహాయింపు లేదు. అధికారంలో ఉన్న రాజకీయనేతలు తమకు నచ్చిన పోలీస్ అధికారులు, దగ్గరి సంబంధాలున్నాయంటూ సిబ్బందికి తమ పరిధిలో పోస్టింగులు ఇప్పించుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు మినహాయించి, కిందిస్థాయి ఖాకీ యంత్రాంగమంతా తాము చెప్పినట్లు నడిచేలా చేసుకున్నారు. తమ మాట వినని కానిస్టేబుళ్లతో పాటు ఏకంగా ఎస్సైలనూ దూరం కొట్టిన సందర్భాలూ ఉన్నాయి. తమకు నచ్చిన అధికారులను ఏళ్ల తరబడి తమ పరిధిలోనే కొనసాగించుకున్న దాఖలాలూ ఉన్నాయి.

సమష్టిగా ప్రజల కోసం..



శాఖాపరంగా మార్పులు చేయడం సహజమే. ఇందులో వ్యక్తిగతంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం ఉండదు. ఏదిఏమైనా పోలీస్‌శాఖ శాంతిభద్రతలు కాపాడేందుకే పనిచేస్తుంది. పోలీసులందరం జిల్లా ప్రజల క్షేమం కోసమే సమష్టిగా పనిచేస్తున్నాం. ప్రజలూ పోలీస్‌శాఖకు సహకరించాలని కోరుతున్నాం.

– జానకీషర్మిల, ఎస్పీ

ఖాకీచొక్కాపై అవినీతి మరకలు

ఓవైపు రాజకీయ జోక్యం పెరగడంతో పాటు మరోవైపు ఖాకీచొక్కలపై అవినీతి మరకలూ పెరుగుతూ వచ్చాయి. ఇదివరకు ఎస్పీలుగా పనిచేసిన జిల్లా అధికారుల తీరును తమకు అనుకూలంగా మలుచుకుని అవినీతికి పాల్పడ్డ అధికారులున్నారు. కొంతమంది ఎస్సైలపై తీవ్రమైన ఆరోపణలూ వచ్చాయి. ఒక మండల ఎస్సై ఏకంగా ఏసీబీకి చిక్కడం గమనార్హం. గతంలో ఓ పట్టణ సీఐ ఎంతో కొంత చేతిలో పెడితే కానీ.. ఏ పనిచేయరన్న పేరును సంపాదించుకున్నారు. కిందిస్థాయి హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న పలువురు సిబ్బంది పైనా గతంలో ఆరోపణలు వచ్చాయి. ఇందులో చాలామందికి రాజకీయ అండదండలు ఉండటంతోనే అప్పట్లో ఉన్నతాధికారులు ఏమీ చేయలేకపోయారన్న వాదనలూ ఉన్నాయి.

వ్యవస్థను గాడిలోకి తెచ్చేలా..

రాష్ట్రంలో, జిల్లాలో రాజకీయాలు మారడంతో పాటు జిల్లా బాసులూ మారారు. కొత్త కలెక్టర్‌తో పాటు కొత్త పోలీస్ బాసులూ వచ్చారు. వీరు వచ్చిన తర్వాత వ్యవస్థల్లో అవినీతిపై సునిశిత దృష్టిపెడుతున్నట్లు స్పష్టమవుతోంది. ప్రధానంగా పోలీస్‌శాఖలో ఎస్పీ జానకీషర్మిల ప్రక్షాళనపై దృష్టిపెట్టారు. ఈనెల 5న 11మంది ఎస్సైలను బదిలీ చేశారు. తన కార్యాలయంలోని సీసీతోపాటు చాలామంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ తదితర విభాగాల సిబ్బందినీ మార్చేశారు. గతంలో రాష్ట్ర ఇంటెలిజెన్స్‌లో ఏళ్లుగా పనిచేసిన అనుభవంతో జిల్లాపై పట్టున్న ఎస్పీ ఇప్పుడు తనదైన ముద్రను వేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఎప్పుడు ఎవరిని మారుస్తారోనంటూ డిపార్ట్‌మెంట్‌లో ప్రక్షాళనపైనే నిత్యం జోరుగా చర్చ కొనసాగుతోంది.

బీజేపీ టికెట్..నగేశ్‌కే

- ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన అధిష్టానం
- బీఆర్‌ఎస్ నుంచి ఇటీవలే కాషాయం పార్టీలోకి 'గోడం'
- సిట్టింగ్ ఎంపీ 'సోయం'కు మొండిచేయి
- బాపూరావు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం..?

సాక్షి,ఆదిలాబాద్: బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా గోడం నగేశ్ పేరునే ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఇటీవలే ఆయన బీఆర్‌ఎస్ నుంచి కమలం పార్టీలో చేరగా తాజాగా టికెట్ కూడా ఆయనకే కేటాయించారు. సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు చుక్కెదురైంది. కాగా ఆయన కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే లంబాడా సామాజిక వర్గంలో ఎవరికైనా టికెట్ ఇవ్వాలని ఆ సామాజిక వర్గ నేతల నుంచి డిమాండ్ వ్యక్తం కాగా రాజకీయ సమీకరణల్లో భాగంగా ఈ స్థానానికి ఆదివాసీ అభ్యర్థి వైపే మొగ్గు చూపారు. మహబూబాబాద్‌లో లంబాడా నేత సీతారాం నాయక్‌కు చోటు కల్పించగా, ఇక్కడ గోండు అయిన గోడం నగేశ్‌కు స్థానం కల్పించారు. దీంతో పార్టీ పరంగా టికెట్‌ను ఆశించిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు, అభినవ్ సర్దార్, ఇతరులకు నిరాశ తప్పలేదు.

ఢిల్లీ పరిణామాల తర్వాత..

బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీ గోడం నగేశ్ గత ఆదివారం ఢిల్లీలో కమలం పార్టీలో చేరారు. ఆ రోజు ఐదుగురు నేతలు కాషాయం కండువా కప్పుకోగా అందులో అజ్మీరా సీతారాం నాయక్, గోమాస శ్రీనివాస్, సైదారెడ్డితో పాటు నగేశ్‌కు ఈ రోజు టికెట్ ఖరారు కావడం గమనార్హం. ఇదిలా ఉంటే నగేశ్ పార్టీలో చేరిన మరుసటి రోజే పార్టీలో టికెట్ ఆశిస్తున్న నేతలు ఢిల్లీ బాట పట్టారు. వారితో పాటు పార్టీ ముఖ్య బాధ్యులు కూడా హస్తినకు చేరుకున్నారు. అగ్రనేతలను కలిశారు. పార్టీలో కొత్తగా చేరే వారికి టికెట్ ఇవ్వవద్దని, ఈ పార్లమెంట్ స్థానంలో సమర్థులైన నాయకులు ఉన్నారని, నగేశ్‌కు టికెట్ ఇస్తే సహకరించమని అధిష్టానానికి స్పష్టం చేశారు. దీంతో నగేశ్‌కు టికెట్ ఇవ్వకపోవచ్చనే ప్రచారం సాగింది. అయితే అధిష్టానం మాత్రం ఆ నేతవైపే ఆసక్తి కనబరుస్తూ ఎంపిక చేసింది. దీంతో ఆశావహులకు చుక్కెదురైంది.



బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్

మూడు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో

గోడం నగేశ్ మూడు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం మొదలవగా ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. కాగా 2014లో కూడా పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఆయన టీడీపీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరి టికెట్ సాధించి ఎంపీగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు చేతిలో ఓటమి చెందారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేయాలని ప్రయత్నాలు చేసినప్పటికీ టికెట్ దక్కకపోవడంతో మిన్నకుండిపోయారు.

బయోడేటా..

పేరు	గోడం నగేశ్
తల్లిదండ్రులు	భీమాబాయి, రామారావు
భార్య	లత (గృహిణి)
సంతానం	కూతురు మనోజ్ఞ(లా చదువుతోంది), కుమారుడు రిత్విక్ (లండన్‌లో ఎంబీఏ పూర్తి చేశాడు)
కులం	ఎస్టీ (గోండు)
విద్యార్హతలు	ఎంఏ, ఎంఈడీ
పదవులు	: 1994, 1999, 2009లో

టీడీపీ నుంచి బోథ్ ఎమ్మెల్యేగా గెలుపు. తొలిసారి గెలిచినప్పుడే గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఎన్టీఆర్ ఆ తర్వాత చంద్రబాబు కేబినెట్‌లో పనిచేశారు.

2014లో బీఆర్‌ఎస్‌లో చేరిక..

ఆదిలాబాద్ ఎంపీగా గెలుపు.

తండ్రి రామారావు రెండు సార్లు బోథ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపు. ఎన్టీఆర్ కేబినెట్‌లో గిరిజన సంక్షేమశాఖమంత్రిగా పని చేశారు.

కిడ్నీ బాధితులకు భరోసా



జిల్లా జనరల్ ఆస్పత్రిలో ..

సంవత్సరం	నిర్వహించిన సెషన్లు
2018	4,007
2019	5,944
2020	5,734
2021	9,925
2022	12,582
2023	12,780
2024	2,061

- చేరువలోనే డయాలసిస్ సేవలు
- జిల్లా జనరల్, భైంసా, ఖానాపూర్ ఆస్పత్రుల్లో అందుబాటులోకి..
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా జనరల్ ఆస్పత్రితో పాటు భైంసా, ఖానాపూర్ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్లు కిడ్నీ బాధితులకు భరోసానిస్తున్నాయి. కిడ్నీలు చెడిపోయి బతుకుజీవుడా.. అని కాలం వెల్లదీస్తున్న రోగులకు ఇవి వరంగా మారాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఒక్కసారి డయాలసిస్ చేస్తే రూ.3వేల వరకు తీసుకుంటారు. ఒక్కో పేషెంట్ పరిస్థితిని బట్టి నెలలో 8నుంచి 12సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. ఇలా అయితే ఆస్తులు అమ్ముకున్నా చికిత్స చేయించుకోవడం నిరుపేదలకు సాధ్యం కాని పరిస్థితి. కాగా, ఈ సేవలు ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా అందిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్లు పేద రోగులకు అండగా నిలుస్తున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన సేవలందిస్తూ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు స్వాంతన లభిస్తోంది.

10యూనిట్లతో 53,033 సెషన్లు

జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో 2.1.2018న డయాలసిస్ సెంటర్‌ను ఐదు యూనిట్లతో ప్రారంభించారు. మూడు నెగెటివ్, రెండు హెచ్‌సీవీ యూనిట్లుగా ఉపయోగించేవారు. నవంబర్ వరకు వీటి ద్వారా 15,181 సెషన్లు నిర్వహించారు. 21.12.2020న మరో ఐదు డయాలసిస్ యూనిట్లు అదనంగా ఏర్పాటు చేసి మొత్తం 10 యూనిట్ల ద్వారా ప్రస్తుతం 76మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఇప్పుడున్న 10 యూనిట్లలో ఏడు యూనిట్లు నెగెటివ్ వారికి, మూడు హెచ్‌సీవీ యూనిట్లుగా వినియోగిస్తున్నారు. సెంటర్ ప్రారంభించిన నుంచి మార్చి 2024వరకు 53,033 సెషన్లు నిర్వహించారు. 10 డయాలసిస్ యూనిట్లు అందుబాటులోకి రాగా, రోజుకు 35నుంచి 45 మందికి డయాలసిస్ చేస్తున్నారు. మరో 15మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు దరఖాస్తు చేసుకున్నా.. ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందించేందుకు సెంటర్ సిద్ధంగా ఉంది.

తగ్గిన ఒత్తిడి

జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో సేవలందించడంతో భైంసా, ఖానాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు డయాలసిస్ అవసరమైతే కొంత ఇబ్బందిగా ఉండేది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భైంసా ఏరియాస్పత్రిలో ఐదు పడకలతో 24.12.2023న, ఖానాపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఐదు పడకలతో ఫిబ్రవరి 2024 నుంచి డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం భైంసా, ఖానాపూర్‌లో డయాలసిస్ సేవలు పొందుతున్న వారితోపాటు మరో 20మంది బాధితులు వచ్చినా డయాలసిస్ చేసే పరిస్థితి ఉంది.

దరఖాస్తు చేసుకోవచ్చు



ప్రస్తుతం నాలుగు షిఫ్టుల్లో డయాలసిస్ సేవలందిస్తున్నాం. అదనంగా ఒక యూనిట్ అందుబాటులో ఉన్నందున మరో 30 మంది పేషెంట్లు దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఆరోగ్యశ్రీలో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– సాయికృష్ణ, జిల్లా జనరల్ ఆస్పత్రి డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి

వినియోగించుకోవాలి



జిల్లా ఆస్పత్రిలో మరో 10 డయాలసిస్ పరికరాల ద్వారా సేవలందిస్తున్నాం. ప్రస్తుతం 81 మంది చికిత్స పొందుతున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న పదేళ్ల బాలుడికీ డయాలసిస్ సేవలందిస్తున్నాం. జిల్లా కేంద్రానికి చెందిన వారెవరైనా ఉచిత సేవలు వినియోగించుకోవాలి. – సునీల్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

మొదటి నుంచి ఇక్కడే..



జిల్లా జనరల్ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభమైన నుంచి ఇక్కడే సేవలు పొందుతున్న. ఎప్పటికప్పుడు కొత్త పరికరాలు ఉపయోగిస్తున్నారు. డయాలసిస్ సెంటర్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందుతున్నాయి.

– అరుణ్, లక్ష్మణచాంద

ఎస్‌హెచ్‌జీలకు 'కుట్టు' బాధ్యత

- మహిళా సంఘాలకే యూనిఫాం ఆర్డర్లు

భైంసాటౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పనులను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో మెప్మా, సెర్ప్ ఆధ్వర్యంలో ఇప్పటికే కుట్టు పని వచ్చిన మహిళా సంఘాల్లోని సభ్యుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకుగాను మొత్తం 1,51,194 జతల యూనిఫాంలు అవసరమని అధికారులు గుర్తించారు. పాఠశాలను బట్టి ఒక్కో విద్యార్థికి రెండు నుంచి నాలుగు జతల యూనిఫాంలు అవసరమని గుర్తించారు. ఈ మేరకు విద్యాశాఖ పరిధిలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, ఇతర విద్యాసంస్థలు యూనిఫాంలు కుట్టే బాధ్యతను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు అవసరమైన యూనిఫాం క్లాత్‌ను సంఘాల సభ్యులకు అందిస్తే 45రోజుల్లోగా కుట్టించి అందించాల్సి ఉంటుంది. ఇందుకుగాను ఒక్కో జతకు ప్రభుత్వం రూ.50 చెల్లించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,069 మంది స్వయం సహాయక సంఘాల మహిళలను కుట్టు పని కోసం గుర్తించారు. కాగా, జతకు కుట్టు చార్జి రూ.50 సరిపోవని, కొంత పెంచితే ప్రయోజనం చేకూరుతుందని ఎస్‌హెచ్‌జీ మహిళలు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులు.. యూనిఫాంల వివరాలు

జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 32,076 మంది బాలురు చదువుకుంటుండగా 71,580 యూనిఫాంలు అవసరమని గుర్తించారు. 36,761 మంది బాలికలు విద్యనభ్యసిస్తుండగా, 79,614 యూనిఫాంలు అవసరమని పేర్కొన్నారు. మొత్తంగా 1,51,194 జతల యూనిఫాంలు అవసరమని తేల్చారు.

మహిళా టైలర్లను గుర్తించాం

స్వయం సహాయక మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాంలు కుట్టే పని అప్పగించాలని ఆదేశాలు అందాయి. ఇప్పటికే మహిళా సంఘాల్లోని టైలర్లను గుర్తించాం. జిల్లాలో 1.51లక్షల జతల యూనిఫాంల ఆర్డర్ అవసరముంది. ఈ మేరకు ఇప్పటివరకు 1,069 మహిళా టైలర్లను గుర్తించాం.

– వెంకటవరప్రసాద్, డీపీఎం (నాన్‌ఫార్మ్)

బాధిత కుటుంబానికి పరామర్శ

సోన్: న్యూబొప్పారం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గురిపెల్లి గంగారాం అలియాస్ పులి గంగన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. రూ.30వేల ఆర్థికసాయం అందించారు. గంగన్న చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన సేవలు కొనియాడారు. నాయకులు సుద్దపెల్లి చిన్నయ్య, గంగారాం, చిన్నయ్య, రమేశ్, భూమేశ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



గంగన్నకు నివాళులర్పిస్తున్న మందకృష్ణ

పరీక్షాకేంద్రాల పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షాకేంద్రాలను డీఐఈవో జాదవ్ పరశురాం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది విధులు, విద్యార్థుల హాజరు తదితర వివరాలు తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. డీఈసీ మెంబర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్‌లు హమీద్, భూక్యా రమేశ్‌నాయక్ తదితరులున్నారు.

'ఐకేరెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు'

నిర్మల్‌చైన్‌గేట్: మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని, బీఆర్‌ఎస్ హయాంలో తాను చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే హస్తం పార్టీలోకి రావాలని ఆరాటపడుతున్నారని పార్టీ పట్టణాధ్యక్షుడు నాందేడపు చిన్ను ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీలు మారడమే తన సిద్ధాంతంగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. తాను, తన అనుచరులు, కుటుంబ సభ్యులు చేసిన భూకబ్జాలు, భూ కుంభకోణాలు బయటపడకుండా ఉండేందుకే కాంగ్రెస్‌లోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. తన అవినీతిని గ్రహించి నిర్మల్ నియోజకవర్గ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించారని పేర్కొన్నారు. పదేళ్లలో నిర్మల్ నియోజకవర్గానికి ఐకేరెడ్డి చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్యకర్త అభిప్రాయాన్ని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు తెలియజేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు అంజుమాన్, అజహర్, అయ్యన్నగారి పోశెట్టి, గాజుల రవి, బురాజ్, మతిన్, కొండా శ్రీనివాస్, కొంతం గణేశ్, చిరంజీవి, ప్రశాంత్, నరేశ్, తిరుమల్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

న్యూస్‌రీల్

చేతివృత్తులను కాపాడాలి



ఇన్నోవేషన్ యాత్రికులతో అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: చేతివృత్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్నోవేషన్ యాత్రికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మల్ కొయ్య బొమ్మలు, పెయింటింగ్స్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత ఉందని, విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. యువత నూతన ఆవిష్కరణలు చేపట్టడం అభినందనీయమన్నారు. కొండాపూర్ గ్రామంలో సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సహజ పద్ధతుల్లో వ్యవసాయం, చేపలు, కోళ్ల పెంపకం చేపడుతున్నామని తెలిపారు. ఇన్నోవేషన్ యాత్ర ఈ నెల 12నుంచి 16తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ నర్సింహారెడ్డి, ఇన్నోవేటివ్ యాత్రికులు, అధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే 'డయల్ 100'కు కాల్ చేయండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: ఎవరైనా ర్యాగింగ్ చేస్తే 'డయల్ 100'కు కాల్ చేయాలని షీటీం పోలీసులు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్షాకేంద్రం వద్ద షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. డయల్ 100, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమరవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నంబర్ 1930 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. షీటీం ఎమర్జెన్సీ నంబర్ 87126 59550కు ఫోన్ చేయాలని సూచించారు.

స్నేహితుడి కుటుంబానికి అండ



ఫర్హానాకు బాండ్ ఇస్తున్న పూర్వ విద్యార్థులు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన మహ్మద్ బషీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబానికి 2000–2001 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు అండగా నిలిచారు. బషీర్ ఇద్దరు పిల్లల పేరిట రూ. లక్షా 16వేలు బ్యాంక్‌లో జమచేసి ఫర్హానాకు బుధవారం బాండ్ పేపర్ అందజేశారు. బషీర్ పిల్లలకు ఉచితంగా విద్య అందిస్తామని కుంటాల శాంతినికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులను పలువురు అభినందించారు. పూర్వవిద్యార్థులు చిన్నా, సంతోష్, ప్రవీణ్, లక్ష్మణ్, రాఘవేందర్, రమేశ్, శ్రావణ్‌రావు, గజేందర్, ప్రభాకర్, గంగామణి, గోదావరి, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సేల్స్ టాక్స్ కార్యాలయంలో టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఇటీవల రూ.30 లక్షల విలువ చేసే గుట్కాను అక్రమంగా రవాణా చేసిన వెహికల్ సీజ్ చేసిన అసిస్టెంట్ కమిషనర్ గోదావరితో పాటు సిబ్బందిని అభినందించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెలుమల ప్రభాకర్, కోశాధికారి భీమ సురేందర్, ఉపాధ్యక్షుడు బీ రవీందర్, జాయింట్ సెక్రటరీ ఎస్.మోహన్‌రెడ్డి, నాయకులు సాయికిరణ్, సంతోష్, సుధాకర్, ముషారఫ్, కార్యాలయ ఉద్యోగులున్నారు.

15న ఇంటర్వ్యూలు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి ఈనెల 15వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీడీఎస్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యాధికారులు–86, ప్రొఫెసర్స్–25, అసోసియేట్ ప్రొఫెసర్స్–27, అసిస్టెంట్ ప్రొఫెసర్స్–34 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన, 31 సీనియర్ రెసిడెంట్స్ హనరోరియం పద్ధతిన నియమించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈనెల 15న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

జాబ్ మేళాకు అపూర్వ స్పందన



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉపాధి రంగాల్లో రాణించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. బుధవారం కేబీ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించింది. జాబ్‌మేళాకు 309 నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. ఇందులో ఆయా కంపెనీల మేనేజర్లు 108 మంది అభ్యర్థులను ఉద్యోగం కోసం, 41 మంది అభ్యర్థులను ఆయా రంగాల్లో శిక్షణ కోసం ఎంపిక చేసినట్లు పీవో పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా తయారు చేస్తున్న ఇళ్లపై ఆదిలాబాద్ ఎక్సైజ్ శాఖ అధికారులు గంగారెడ్డి, అక్బర్ హుస్సేన్, ఉట్నూర్ ఎస్సై మురళీ కృష్ణ బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలోని శాంతినగర్, మండలంలోని పెర్కగూడ హనుమాన్‌నగర్, లక్కారం గ్రామాల్లో దాడులు నిర్వహించగా బానావత్ శంకర్, ముంజం కతియాజ్జి, కుంచపు వినోద్‌ల వద్ద నుంచి మొత్తం 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు

నార్నూర్: గంజాయి, నాటుసారాను తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్సై రవి కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని సుంగాపూర్ గ్రామంలో ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన రాథోడ్ తుకారాం తండ్రి పేరు మేఘు ఇంటి వద్ద విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 10లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. ఇప్పపువ్వు మిశ్రమం, బెల్లం, ఇప్ప పువ్వును స్వాధీనం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక పనులకు ఎవరు పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. యువత చెడు వ్యసనాలకు లోనుకావద్దని సూచించారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

ఎర్త్‌సెంటర్ అలయన్స్‌లో 'ఆర్జీయూకేటీ'



పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్స్

నిర్మల్: హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని జింఖానా ఎన్‌క్లేవ్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ బుధవారం నిర్వహించిన ఎర్త్ సెంటర్స్ అలయన్స్‌లో ఆర్జీయూకేటీ అధ్యాపకులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్స్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పాల్గొన్నారు. పర్యావరణ సమస్యలు, జీవ వైవిధ్య ప్రాముఖ్యత, వనరుల సంరక్షణలో అందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. బాసర ట్రిపుల్‌ఐటీ తరఫున అసిస్టెంట్ ప్రొఫెసర్స్ శ్రీనివాస్ గజ్జెల, రవికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

నిర్మల్‌టౌన్: భైంసా పట్టణంలో ఇటీవల హత్యకు గురైన సయ్యద్ సోహెల్ కేసును ఛేదించినట్లు ఎస్పీ జానకి షర్మిల బుధవారం తెలిపారు. నిందితుడు జుబేర్‌తో పాటు సహకరించిన భైంసాకు చెందిన అబ్దుల్ జుబేర్‌ను ఇటీవల అరెస్ట్ చేయగా, మిగతా నిందితులైన అబ్దుల్ జమీర్, అబ్దుల్ ఆదిల్, అబ్దుల్ సొహైల్‌లను బుధవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన స్క్రూ డ్రైవర్, మొబైల్ ఫోన్లు, బైక్, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

సిరిచెల్మ మల్లన్న జాతరకు వేళాయె

- నేటి నుంచి జాతర ప్రారంభం
- ఈ నెల 21వరకు నిర్వహణ
- కాకతీయుల కాలంలో... చెరువు మధ్యలో ఆలయ నిర్మాణం



జాతరకు ముస్తాబైన సిరిచెల్మ మల్లన్న ఆలయం

ఇచ్చోడ: కాకతీయుల కాలంలో నిర్మించిన సిరిచెల్మ మల్లన్న ఆలయం జాతరకు ముస్తాబైంది. జాతర కోసం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు వారం రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఉదయం ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. ఈ నెల 14న ప్రారంభం కానున్న జాతర 21వ తేదీ తెల్లవారు జామున ముగియనుంది. జాతర ముగింపునకు ఒక్కరోజు ముందు తెల్లవారు జామున ఆలయ ఆవరణలో అగ్ని గుండం ఏర్పాటు చేయనున్నారు. ఆ అగ్నిగుండం నుంచి భక్తులు నడుచుకుంటూ వెళ్లి మొక్కులు తీర్చుకోవడం ఈ జాతర ప్రత్యేకతలో ఒక్కటి. అనంతరం వేంకటేశ్వరస్వామి, మల్లన్న రథాలతో ప్రధాన వీధులు గుండా ఊరేగింపు నిర్వహించడంతో జాతర ముగియనుంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు జాతరకు వస్తుంటారు.

ఆలయంలో అద్భుత అపురూపాలు...

ఆదిలాబాద్ జిల్లాలో అతిపురాతన శివాలయంలో సిరిచెల్మ మల్లన్న ఆలయం ఒక్కటి. ఈ ఆలయంలో అద్భుతమైన దృశ్యాలు భక్తులను ఆకట్టుకుంటాయి. మండల కేంద్రం నుంచి 18కిలో మీటర్ల దూరంలో అటవీ ప్రాంతం ఈ ఆలయం తూర్పు ముఖ ద్వారంతో ఉంటుంది. సూర్యుడు ఉదయించగానే సూర్యకిరణాలు నేరుగా గర్భగుడిలోని శివలింగంపై పడటంతో చిమ్మచీకట్లలో ఉన్న శివలింగం దివ్యకాంతులతో వెలిగిపోవడం ఈ ఆలయ ప్రత్యేకతలో మరొకటి. చెరువు మధ్యలో ఉన్న ఈ ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించినట్లు పెద్దలు చెబుతుంటారు. శివాలయంలో ఆంజనేయుడు, శనిదేవుడు, మహిషాసురవర్ధిని, ఏడుపడగల నాగపాము విగ్రహాలు కళాభిమానులను ఆకట్టుకుంటాయి. చతుర్ముకుడైన జైన తీర్థాంకరుడు, ధ్యాన ముద్రలో ఉండే బుద్ధుడి ప్రతిమలతో ఆలయం రమనీయతతో వెలిగిపోతుంది. శ్రీనివాసుని ప్రతిమ ఆలయంలో కుడి పక్కన ఉంటుంది. ఆ విగ్రహం చేతిలో నాణెలు అతుక్కుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. మరోచోట ఆరు ముఖాలు కలిగిన కార్తికేయుడి విగ్రహం కూడా దర్శనమిస్తాడు. సిరిచెల్మ మల్లన్న ఆలయం నుంచి నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం వద్ద గృహలోని శివలింగానికి సొరంగ మార్గం ఉన్నట్లు కూడా చెబుతుంటారు. అప్పట్లో కాకతీయులు పాలించే కాలంలో సిరిచెల్మ ప్రాంతం నుంచి సొరంగ మార్గం ద్వారా కుంటాలలోని శివలింగాన్ని దర్శించుకోవడానికి వెళ్లేవారని ప్రాచుర్యంలో ఉంది.

ఈపీఎఫ్ డబ్బులు వెంటనే జమ చేయాలి

- ఈపీఎఫ్ కమిషనర్‌కు సీఐటీయూ వినతి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఎదులాపురం: కార్మికుల జీతాల్లో ఈపీఎఫ్ రూపంలో కోత విధిస్తున్న నగదును వారివారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆదిలాబాద్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం కరీంనగర్ రీజినల్ కార్యాలయంలో ఈపీఎఫ్ కమిషనర్ తానయ్యకు వినతి పత్రం అందజేశారు. గత 16 నెలల నుంచి ఈపీఎఫ్ డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమ చేయడం లేదని, నిధుల దుర్వినియోగం జరుగుతున్న తీరును ఈపీఎఫ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈపీఎఫ్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ కార్మికులకు న్యాయం చేస్తానని, ఈ నెల చివరి వరకు డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు దర్శనాల మల్లేశ్, జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుంద్‌రెడ్డి, ఎడ్ల రమేశ్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగం రాజమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దర్శనాల నగేశ్, జనార్దన్, ఆత్మారామ్, ఎండీ అజీమ్ పాల్గొన్నారు.

భర్త, అత్తకు ఏడేళ్ల జైలు

నిర్మల్‌టౌన్/ఖానాపూర్: వివాహిత ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్తకు నిర్మల్ న్యాయస్థానం బుధవారం ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణం శాంతినగర్‌కు చెందిన బైరి లక్ష్మి(25), కడెం మండలం పాతమద్దిపడగ గ్రామానికి చెందిన బైరీ రమేష్‌కు 23 మే 2013న వివాహమైంది. పెళ్లిలో కట్నంగా లక్ష రూపాయలు, తులం బంగారం, మోటార్ సైకిల్ ఇచ్చారు. పెళ్లైన తర్వాత వీరికి ఓ పాప జన్మిచ్చింది. ఆ తర్వాత బైరి రమేష్ అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెతో గ్రామం వదిలి వెళ్లిపోయాడు. నెల రోజుల తరువాత ఆమెను తీసుకుని ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న బైరి లక్ష్మి, తల్లి కౌసల్య కుల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. గ్రామ పెద్దలు బైరి రమేష్‌కు రూ.20వేల జరిమానా విధించారు. కొద్ది రోజుల తర్వాత బైరి రమేష్ భార్యను డబ్బులు నువ్వే కట్టాలని వేధించడం మొదలుపెట్టాడు. దీంతో లక్ష్మి తల్లి రూ.20వేలు కట్టి నచ్చజెప్పి సంతోషంగా ఉండాలని చెప్పింది. మళ్లీ కొన్ని రోజులకు బైరి రమేష్, ఆయన కుటుంబ సభ్యులు రూ.50వేలు కట్నం తీసుకురావాలని వేధించడం మొదలు పెట్టారు. దీంతో 23 జూలై 2017వ తేదీ రాత్రి 8గంటల ప్రాంతంలో పాతమద్దిపడగ గ్రామ శివారులోని పొద్దుటూరి నరసింహారెడ్డి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తల్లి కౌసల్య కడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై రాము కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం అప్పటి డీఎస్పీ మనోహర్‌రెడ్డికి అప్పగించాడు. డీఎస్పీ కేసు విచారణ అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరు పరిచాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు 17మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేశాడు. దీంతో వారికి పైవిధంగా శిక్ష విధిస్తూ.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ తీర్పునిచ్చారు.

16న ఉమ్మడి జిల్లా గిరిజన క్రీడా పాఠశాలల ఎంపిక

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయి గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 16న ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో తుది ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయిలో ఎంపికైన బాలురు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. వీరు ఎలిజిబిలిటీ ఫారాలు, బోనాఫైడ్, ఆధార్ కార్డు ప్రతులతో సహా ఉదయం 9గంటలకు జిల్లా గిరిజన క్రీడల అధికారి కె. పార్థసారథికి రిపోర్టు చేయాలని కోరారు. ఎంపికైన బాలికలు ఈ నెల 15న ఆసిఫాబాద్‌లోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో జరిగే తుది ఎంపిక పోటీల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో ఆవులు మృతి

నార్నూర్: మండలంలోని మహాగావ్ గ్రామపంచాయతీ పరిధిలోని శేకుగూడ గ్రామానికి చెందిన తొడసం భూమ, ఉర్మి గ్రామానికి చెందిన జాదవ్ హిరాలాల్‌లకు చెందిన ఆవులు మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. వివరాల ప్రకారం.. మంగళవారం ఆవులు గ్రామ సమీపంలోని పొలాల్లో మేస్తుండగా విద్యుత్ తీగలు కింద పడిపోవడంతో షాక్ తగలి అక్కడికక్కడే మృతిచెందాయి. విద్యుత్‌శాఖ లైన్‌మెన్ రాథోడ్ రవీందర్ శేకుగూడ గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

చదువులమ్మ ఒడిలో 'సరస్వతి' విగ్రహం

బోథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులు సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ విగ్రహాన్ని ప్రధానం చేశారు. బుధవారం అరవింద్ పూజారి మంత్రోచ్చారణల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతి విగ్రహాన్ని విద్యార్థులు ఏర్పాటు చేయడంపై పలువురు అభినందించారు. ప్రిన్సిపాల్ ఉమేష్ రావ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

తాంసి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సీజీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తాంసి, భీంపూర్, తలమడుగు మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల కోసం పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్ఈ చౌహాన్, సీజీఆర్‌ఎఫ్ సభ్యుడు రాజగౌడ్, కిసాన్, డీఈ హరికృష్ణ, వీరన్న, ఏడీ దేవగౌడ, ఏఈలు మనోజ్ కుమార్, శ్రావణ్, సతీష్ ఉన్నారు.

ప్రేమోన్మాదికి బెయిల్ రాకుండా చూడాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ

ఖానాపూర్: అలేఖ్య అనే యువతిని పట్టపగలు నడిరోడ్డుపై హత్య చేసిన ప్రేమోన్మాది శ్రీకాంత్‌తో పాటు మిగతా నిందితులకు బెయిల్ రాకుండా చూడాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇదివరకే యువతి వివాహాన్ని చెడగొట్టిన నిందితుడు పోలీసుల సమక్షంలో మరోసారి తప్పుచేయనని ఒప్పుకొన్నప్పటికీ తిరిగి యువతిని అతి దారుణంగా హత్య చేశాడని తెలిపారు. అలాంటి వ్యక్తి బెయిల్‌తో బయటకు వస్తే బాధిత కుటుంబానికి రక్షణ లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఈ కేసు విషయంలో న్యాయవాదులతో పాటు ప్రభుత్వం నిందితుడికి బెయిల్ రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో బాధిత కుటుంబానికి పరోక్షంగా మరోసారి నష్టం జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సమత కేసు తరహాలో నిందితుడు జైలులో ఉన్నప్పుడే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. అలేఖ్య ఘటనలో ప్రభుత్వం పూర్తిస్థాయి బాధ్యత వహించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు తీవ్రంగా గాయపడ్డ మరో యువతిని ఆదుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఆయన వెంట నాయకులు నంది రామయ్య, కట్ట శ్రీనివాస్, కావలి సంతోష్, జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, నిట్ట రవి, మురళీకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

దొంగిలించిన సొత్తు రికవరీ

- నలుగురు నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన దొంగలు మహ్మద్ మోయిజ్, వడ్గూరి రతన్, షేక్ అబ్దుల్, సయ్యద్ సుల్తాన్‌లను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తాంసి బస్టాండ్ లోని కిరాణ దుకాణంలో, గాయత్రినగర్, టీచర్స్ కాలనీ, భుక్తాపూర్‌లలోని ఇళ్లల్లో తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. అదేవిధంగా శివాజీ చౌక్‌లోని మారమ్మ ఆలయంలో దొంగతనం చేశారు. వీరి నుంచి రూ.59వేల నగదుతో పాటు ఆరు తులాల ఒక గ్రాము బంగారం, 17 తులాల వెండీతో పాటు ఆయిల్ డబ్బాలను రికవరీ చేసినట్లు వివరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌజింగ్ బోర్డుకు చెందిన మహ్మద్ మోయిజ్ పేరిట 53 చోరీ కేసులు ఉండగా డీసీ షీట్ తెరవడం జరిగిందని, వీటిలో 17 కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 6న జైలు నుంచి విడుదల కాగా 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వరుస దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మహాలక్ష్మివాడకు చెందిన రతన్‌పై 30 కేసులు ఉండగా సస్పెక్ట్ షీట్ ఉన్నట్లు చెప్పారు. ఈ దొంగలను పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మూడు రోజుల్లోనే కేసులను ఛేదించడం జరిగిందని తెలిపారు. దొంగలను పట్టుకున్న పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేశారు. సమావేశంలో టూటౌన్ సీఐ అశోక్, రూరల్ సీఐ ఫణిందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, టూటౌన్ ఎస్సై రమణారెడ్డి, పోలీసు సిబ్బంది సుధాకర్ రెడ్డి, నరేందర్, ప్రవీణ్, కరీం, రమణ, హన్మంతు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రులను కలిసిన గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: ఎన్‌ఆర్‌ఐ పాలసీతో కూడిన గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తూ, గల్ఫ్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ గల్ఫ్ జేఏసీ ప్రతినిధుల బృందం బుధవారం పలువురు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులను కలిసింది. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తూ, గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించింది. నిర్మల్ జిల్లాకు చెందిన ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పర్కిపండ్ల, గల్ఫ్ సంక్షేమ అవగాహన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దొనికెన కృష్ణ, గుగ్గిళ్ల రవిగౌడ్‌లతో కూడిన ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులైన దుద్దిల్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. వీరి వెంట జేఏసీ నాయకులు చెన్నమనేని శ్రీనివాసరావు, తోట ధర్మేందర్, మంద భీమ్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, వినోద్ కుమార్ ఉన్నారు.

పీఎం సూర్యఘర్ వినియోగించుకోవాలి

కైలాస్‌నగర్: పీఎం సూర్యఘర్‌ను దఅర్హులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన నరేంద్ర మోదీ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పీఎం సూర్యఘర్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ వర్చ్‌వల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం సామాజిక అభ్యున్నతి, ఉపాధి ఆధారిత ప్రజా సంక్షేమమని పేర్కొన్నారు. ఈ పథకం కింద సఫాయి కర్మచారి, బీసీ కుల వృత్తుల వారికి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ కుల వృత్తులు చేసే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్ ప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి రాజలింగం ఉన్నారు.

లారీ ఎక్కిన రైలింజన్



గుడిహత్నూర్: భలే..భలే.. రైలింజన్ కాస్త లారీ ఎక్కిందోచ్. ఎంచక్కా రోడ్డుపై వెళ్తోంది కూడా. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై ఓ భారీ లారీపై బెంగుళూరు నుంచి ఢిల్లీకి కొత్తగా తయారు చేసిన రైలింజన్‌ను తరలిస్తుండగా స్థానికులు బుధవారం ఆసక్తిగా తిలకించారు.

ఛాతినొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య



మనోహర్(ఫైల్)

ఇంద్రవెల్లి: ఛాతినొప్పి భరించలేక ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ కాలనీలోని చోటుచేసుకుంది. ఎస్సై దుబ్బాక సునీల్, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మిలింద్‌నగర్ కాలోనికి చెందిన గిత్తె మనోహర్(44) కారు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య గిత్తె ఆశబాయి ఎంపీటీసీగా, సామాజిక కార్యకర్తగా సేవలందిస్తోంది. రెండు నెలల క్రితం మనోహర్‌కు ఛాతినొప్పి రాగా కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. దీంతో కొంత ఆరోగ్యం కుదుటపడింది. అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. వారం రోజులుగా ఛాతినొప్పి వస్తుందని, తాను చనిపోతాననే బెంగతో బాధపడుతుండేవాడు. బుధవారం ఉదయం మనోహర్ నిద్రలో ఉండగానే భార్య గిత్తె ఆశబాయి ఉపాధి హామీ పనులకు వెళ్లి వచ్చేసరికి భర్త ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక రైతులు తమ వ్యవసాయ చేనుకు వెళ్తున్న క్రమంలో వారికి కాలువలో కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారమివ్వగా ఎస్సై అమోస్ అక్కడికి చేరుకుని పరిశీలించాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని వెలికి తీయించి పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన గోగుల రాజేశ్వర్ (24) క్షణికావేశంలో బుధవారం మంగల్‌లొద్ది అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇచ్చోడ మండల కేంద్రంలో భార్యతో కలిసి ఉంటున్నాడు. రాజేశ్వర్ శివరాత్రి పండుగ కోసం తన స్వగ్రామం నేరడిగొండకు వచ్చాడు. ఈ నెల 9న ఇచ్చోడకు వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం అటవీశాఖ సిబ్బంది సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భార్యతో గొడవ పడుతుండేవాడని మృతుడి తండ్రి తెలిపినట్లు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మేమింతే.. మారమంతే







రోడ్డు ప్రమాదాల గురించి పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొంత మంది వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ట్రిపుల్ రైడింగ్‌తో ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అయినప్పటికీ కొంతమంది యువత ద్విచక్ర వాహనాలపై ముగ్గురు కూర్చొని వెళ్తున్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు బైక్‌లు ఇస్తున్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు కన్నీరుమున్నీరవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్